# అభివ్యక్తం

గుండెలోంచి ఆయాసం తన్నుకొచ్చేస్తున్నా పరుగాప లేదు, వేగం తగ్గించలేదు. ఎదురుగా ఓ పెద్ద మనిషి రావడం గమనించింది మంగి. అవును, అతని చేతికి వాచీ కూడా వుంది. దగ్గరగా వచ్చేసేడు.

"ఏండీ.. టైమెంతయ్యిందండీ" అని అడిగింది.

"పది".

తృప్తిపడలేదు. అందుకని అతని వెనకపడి పరిగెత్తి.... "సరిగా ఎంతయ్యిందండీ" అని మళ్ళీ అడిగింది.

"సరిగ్గా పదీ పది..సరా" అంటూ అతను నడకవేగం పెంచీసరికి తిరిగి బడివైపు పరుగందుకుంది మంగి.

సాలిపేట నుండి కంటోన్మెంటు మున్సిపల్ హైస్కూలుకు వెళ్ళాలంటే ఎలా లేదన్నా పావుగంటకి తక్కువవ్వదు. మరాలెక్కని పదిన్నరకి గాని చేరుకోలేదు. మంగి గుండె బేజా రైపోయింది.

పరిగెడుతూ పరిగెడుతూంటే ఆలోచనలు గొలుసులు గొలుసులుగా మంగిని చుట్టేస్తున్నాయి.

'ఇయాళ నాకుంది పెళ్ళి. ఫస్టు పిరీడు సోసలు మేస్టుగి. దుమ్ము దుళ్ళగొట్టేస్తారు. పది గంటలకి బడైతే పదిన్నరకంటే

రాడం. ..తియ్యంటూ గుంజిళ్ళయినా తియ్యించీస్తారు....పట్‌మని సెయ్యైనా పట్టమంటారు....

నిన్నటికినిన్నా ఆకరి పిరీడు సెప్పకుండొచ్చీసేను. అదీ సోసలు పిరీడే. నాలుగ్గంటలకి మూడో పిరీడయ్యిందని గంట కొడ్తారు. ఆకరి పిరీడప్పుడు మొదలు. సరింగప్పుడే సాలిపేటకీ కంట్రటమెంటుకీ మజ్జినున్న కొళా యొగ్గుతారు. మంచీళ్ళు పట్టే డూటీ అప్పది. కాని నిన్న మూడో పిరీడప్పుడు క్రాప్టు పిరీడు. సత్తెవప్పొచ్చింది....ఓలి మంగీ అమ్మకి బాగో నేదు....మల్లీ తిరగబెట్టింది....కనకం పిన్నీ, నానూ ఆస్పత్రికెల్తన్నం.... ఇగో తాళం. మేష్టారినడిగింటికెల్లే...నా నట్నించొచ్చేసరికి యేయేల వుద్దో, ఆ సేత్తో అలాగే నాలుగు బిందిలు మోసీయెత ల్లీ-అని సెప్పింది. మేష్టారి నడి గెల్లమంది. సోసలు మేష్టుర్ని ఒగ్గరు. మరంచేత సెప్పకుండా సెయ్యకుండా పారొచ్చీసింది....

'అప్పనమ్మో....ఇప్పుడు గేపకవొచ్చింది. మూడు ప్రెశ్న లప్ప జెప్పుకుంటానన్నారు సోసలు మేష్టుర్ని....ప్రెశ్నలంటే ప్రెశ్నలుకావు. ఆటికి జవాబులు. నిన్ననే అప్పజెప్పుకుంటా నన్నారు. ఇయేళ తప్పదు. నా ఒళ్ళు నాదికాదు.'

గుండెలు భయంతో దడదడమనగానే ఆలోచనల గొలుసులు తెగిపోయేయి.

'ఆ అయ్యన్నపేట గుంటనేదా...లష్మి. దాన్నుండే ఆలీసెం. నా నొచ్చేదాకుండే నీసైన్సు నోట్సు రాస్కోవాల

అన్నాదా....బేగిరావొద్దూ' అని బయటికే గోణుక్కుంది మంగి.

అమ్మెక్కర్తి....పోసి అదొచ్చేవరకు సోసలు సదువుదా రని కూసుంటే, ఓలి నీ సదువు సంతకుదోలా....సూరంతా పొగ నిండిపోతందే ఎగదొయ్యే..'అంటూ ఖంగు ఖంగుమని మంచంలోనుంచే దగ్గులూ.... కేకలూ....మరింకేటి సదివేది పైకే విసుగ్గా అనుకుంది.

"ఓలిమంగీ...." వెనుక నుండి కేక.

పరుగాపింది. అందాకా తీసిన పరుగు ముందుకు తోసే స్తున్నాది. గొంతు తడారిపోయింది. రొప్పుతూ వెనక్కి చూసింది మంగి.

అదే. లక్ష్మి. ఉండే అంటూ చెయ్యూపుతున్నాది....'రా.. నీపని చెపుతాను'- అనుకుంది మంగి.

కుడిచేతిలో దొంతెడు పుస్తకాలు. ఎడంచేతితో సిల్వరు కేరేజి. దానికితోడు లంగా బొందూడిపోతోంది. మోచేత్తో అదుముకుంటూ పరిగెత్తుకు వచ్చింది. కసిక్కిన నవ్వింది మంగి. ఆయాసంతోనూ, మేస్టారి భయంతోనూ వచ్చిన ఆ నవ్వు నవ్వులా లేదు. గంట కిందటైన వమనాన్ని నోట్లో వుంచుకుని ఒక్కసారిగా కక్కినట్టుంది.

ఏంటోలెమంగీ.... అంత గీరవాణం....ఇంటి కాడుండే ఒచ్చేస్తానంటే ఏంటమ్మా పారొచ్చిస్తన్నావు...అంతా కులికిద్దం

బుద్దేనే....అంది లక్ష్మి కేరేజీ, పుస్తకాలూ కిందన పెట్టిలంగా బొందు ముడేసుకుంటూ.

"నీకెన్ని సుట్లు సెప్పేను మంగీ అనొద్దని. మంగవేణి అని పిల్లేవేటి?" అంది కోపంగా మంగి. మెల్లగా నడక మొద లెట్టేరిద్దరూ, అయినాలస్యం ఎల్లాగూ అయింది.

"నువ్వేమట్టుకు లష్మిఅని పిల్డంనేదా....వొర్లష్మి అని పిల్లేవా?"

"తొమ్మిది గంటలకొస్తానన్న దానివి పదయినా పత్తా లేకపోతేటి సేసీది...." అంది ఇందాకటి మాటకి జవాబుగా.

మరి కిక్కురు మన్లేదు లక్ష్మి. కాసేపుండి మాట మార్చింది.

"అవునోలె .... సోసలు ప్రెశ్నలొచ్చీసునే? మేస్టుకి తంతారుగావాలి."

"నేదు...ముద్దెట్టుగుంటారు. రెండు సుట్లు. అలీసెం అయి నందుకూ, అప్పజెప్పనందుకూను. పదపద...బేగినడు." అంది విసుగ్గా మంగి.

ఎదురుగా బడి.

బడిగేటు పులినోరులా ఆవలించుకునుంది.

గ్రౌండంతా నిశ్శబ్దంగా వుంది.

తోమ్మిదో క్లాసు 'ఏ' సెక్షను కంటోన్మెంటు కబేళాలా వుంది. సగం మంది బెంచీల మీద నిలబడి చూరుకు వేళ్ళాడేసిన కోసేసిన గొర్రెల్లా వున్నారు. గోకపేట గొర్రెలోళ్ళ పిల్లైతే గోడ కుర్చీవేసి కొయ్యడానికి కూర్చోపెట్టిన మేకలా వుంది. మేస్టారి ముఖం రాక్షసుడు నవ్వితే ఎలాగుంటాదో అలా వుంది.

"ఎన్నిగంటలకే బడి.." అని గర్జించేడు సోషలు మేస్టారు.

"అవునే మంగవేణి... ఇలారా.. నిన్న ఆఖరి పిరియడు ఎక్కడికి పోయేవు? పైగా ఇప్పుడాలస్యం. అప్పుజెప్పేకుంటా నన్జెప్పి దొంగ వేషాలు వేస్తావూ...నువు వేషాలేస్తే నేనాది తేస్తానూ..." అంట్నూమంగి చెవి దొరక పుచ్చుకున్నారు.

పై ప్రాణాలు పైనేపోయేయి మంగికి.

"చెప్పు... పోనీ ఆలస్యంగా వస్తే వచ్చేవు. నిన్న ఎగ్గొడితే ఎగ్గొట్టేవు, జవాబు లొచ్చునా...?"

ఒస్తున్న దుఃఖాన్నీ, కలుగుతున్న భయన్నీ ఆదుపులో పెట్టుకోబోవడంలో ముఖం వికారంగా తయారైంది. ఆ ముఖం చూడగానే బోధపడింది మేస్టారికి.

"మిమ్మల్నిలా కాదే..." అంటూ చెవి మెలిపెట్టి... "రేపొచ్చేటపుడు మీ అయ్యని తీసుకురా..." అన్నారు.

అయ్యా మాటెత్తేసరికి మంచంలో జబ్బుతో పడున్న

అమ్మ కళ్ళముందు కదిలింది.

బెల్లం కొట్టిన రాయిలా నోరు మెదపవేం? చెప్పు....మీ అయ్యింట్లో వున్నాడా?" చెవి పట్టుకు ఊపుతూ అడిగేరు మేష్టారు.

"లేదండి... సచ్చిపోయేడు...."

గతుక్కుమన్నారు. గబుక్కున చెవి వదిలేసేరు. వెంటనే సర్దుకుని, గంభీరంగా "అయితే మీ అమ్మని తీసుకురా...." అన్చెప్పి జవాబుకోసం చూడకుండా లక్ష్మి పని పట్టించేరు. అదయ్యేక అక్కడ నిలబడి చదమన్నారు.

కళ్ళముందు పుస్తకంవున్నా అక్షరాలవెంట పరుగులు తియ్యడంలేదు మంగి కళ్ళు.

అల్లక్కడ ఆరో క్లాసులో పొట్టేలు వెనుక గొర్రెలమంద కుమ్ముకు వెళ్తున్నట్టు, లీడరేదో గట్టిగా అరుస్తూంటే వంత పాడుతున్నారు. ఇంకా పదకొండు గంటలయినా కాలేదుగాని పదో క్లాసు కుర్రాళ్ళు పదిమంది గ్రౌండులో చేరిపోయి సాయంకాలం ఆడాల్సిన కబాడీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పన్లోపని ఒకళ్ళమీ దొకళ్ళు ఇసకని జల్లుకుంటున్నారు. తొమ్మిదీ బీ నుండి తుంటరిపిల్ల ఒకర్తి మంగిని చూస్తూ .... "అయిందా పెళ్ళి....అచ్చికచ్చా" అన్నట్టుగా చుపుడువేలు ఝూడిస్తోంది. ఏడో క్లాసులోనో మరెక్కడో, ఓ పెద్ద కుక్క గయ్యిమంటే చిన్నకుక్క కుయ్యిమన్నట్టు మేస్టారి కేకా, ఆ వెనుక ఓ పిల్ల ఏడుపూ వినిపిస్తున్నాయి.

గంట కొట్టేరు.

"ఏ రోజు చెప్పిందారోజే పరగడుపు....మిమ్మల్నీ, ఈ స్కూలునీ బాగుచెయ్యడం బ్రహ్మతరంకాదు. ఊఁ....లోపలికి తగలడండి." అంటూ మరోసారి అక్షింతలువేసి బయటికి నడిచేరు సోషలు మేస్టారు.

సర్రున ఆయన వెనక పరిగెత్తింది లావణ్య.

ఎర్రెర్రగా, నీలం నీలంగా వున్న అంతంత పువ్వులతో తెల్లటి పట్టుకుచ్చులాంటి లంగాకున్న కుచ్చెళ్ళన్నీ సముద్ర తరంగాల్లా ఉరికురికి పడుతున్నట్టుందా పిల్ల పరిగెడ్తూంటే. ఆ అమ్మాయివంకే సంభ్రమంగా యింతింత కళ్ళు చేసుకు చూసింది మంగి.

"మాస్టారూ" అంది స్పష్టంగా, ముద్దుగా లావణ్య.

మేస్తారూ, మేస్టారూ, మేస్టురిగారండీ, మేస్టిగారూ అన్న రకరకాల పిలుపులకి అలవాటుపడిన ఆయనకి లావణ్య చేత అలా స్పష్టంగా, చక్కగా పిలిపించుకోవడం ఎంతో ఇష్టం.

"ఏమిటమ్మా లావణ్యా" అనడిగేరు ఆగిపోయి.

"మాస్టారూ....మధ్యాహ్నం రెండో పిరియడు సోషల్ స్టడీసు వుందికదా....మూడు ప్రశ్నలకి జవాబులు అప్పుడు అప్పజెప్పకుంటారా....రేపు అప్పజెప్పుకుంటారా?"

మంగికీ నచ్చింది యీ ప్రశ్న. చెవులు పెద్దవి చేసుకుని వింటోంది.

"మధ్యాహ్నం గుర్తు చెయ్యమ్మా ... అన్నట్టు నీకు వచ్చునుకదూ? నీకు రాకపోతే ఎవరికి వస్తాయిలే" అంటూ బుగ్గను పుణికి స్టాఫ్ రూము వైపు కదిలేరు మేస్టారు.

"ఇంతదాక బతికీసే వసుకున్నానే" అంది లక్ష్మి.

''లావణ్య బాగా సదూతాది..ఒప్పజెప్పుకుంటా నన్జెప్పి, ఒప్పజెప్పుకోపోతే అడగదేటి...ఆ పిల్ల నెందుకనుకోవాల''అంది మంగి పెద్ద మనసుతో. ఆ పెద్ద మనసులో ఆ పిల్ల కట్టుకున్న పెద్ద పువ్వులున్న పట్టులంగా రెపరెప లాడుతోంది.

"ఆ పిల్ల నెవరన్నా రే...అయితే నీగ్గాని ఒచ్చిసునేటి.... ఆ పిల్లని ఎనకేసుకొస్తన్నావు?"

''నాకూ రావు'' నెమ్మదిగా అంది మంగి.

"మరేఁవీ"

''ఇప్పుడు రొండో పిరీడు డ్రాయింగుందికదా ... సదివిద్దారోలే'' అంటూ పుస్తకం తీసింది మంగి.

''అంత సులువు గొస్తదీ మనకి'' అంది మళ్ళీ నిరుత్సాహంగా.

"సదివి తెందుకు రాదు?'' పుస్తకంలో ముఖం దూరుస్తూ అంది లక్ష్మి.

''అదెలాగ్గ సతవడం...మా యమ్మకి బాగోనేదు. నిన్న మజ్జేనం మాయప్ప ఆస్పట్లకి తీసికెల్లిందా...నాబంలేదని డాట్టరు

సెప్పిసినాడట'' అని కొంతసేపు గొంతుపూడుకుపోయి ఆగింది. మళ్ళీ కళ్ళల్లో రెపరెపలు శబ్దం చేసేయి.

"కిందటి పండక్కి మాయమ్మ పన్జేస్తున్న ఇంటోళ్ళు లంగా జాకెట్టిచ్చేరు. ఇదుగిదే. అరగదీసరగదీసి సిరుగట్టిపోయింది. ఈ ఏడాది కూడా యిస్తారేవోనని ఆసెట్టుకున్నాను. మాయమ్మ ఎన్నడోగాని ఎళ్ళడం నేదు. మాయప్పకి పెళ్ళి కుదిరిపోయింది. మరి మాయమ్మ సూస్తే యిలాగి."

''ఒలేటె సోది?'' అని విసుక్కుంది లక్ష్మి.

మాటాడకుండా మళ్ళీ పుస్తకంలో తలదూర్చింది మంగి. కాని ఆ పుస్తకం నిండా ఎర్రెర్రటి పువ్వులూ - నీలం నీలం పువ్వులు-తెల్లటి పట్టు కుచ్చులాంటి లంగా కనిపిస్తున్నాయి. దీక్షగా చూస్తున్న కొద్దీ ఖంగు ఖంగుమన్న అమ్మ దగ్గులోంచి పడే ఎర్రటి రక్తం బిళ్ళలూ-నీలం నీలంగా మారిపోతున్న అమ్మ శరీరం-అక్షరాలు కనిపించని తెల్లని కాగితాలు మాత్రమే మంగి కళ్ళముందు కదుల్తున్నాయి.

'ఒలినెగే' ... డ్రాయింగు మేష్టారొచ్చేరు.' అని మోచేత్తో పొడిచింది లక్ష్మి.

ఆయనేదో వర్కు అప్పగించేరు.

అంతే. మధ్యాహ్నం రెండో పిరియడు వరకు చదవడానికి సమయమూ చిక్కలేదు, ఆలోచించడానికి సందూ దొరకలేదు.

మధ్యాహ్నం రెండో పిరియడు.

భగ భగ ఎండ మండించేస్తోంది. మొదటి బెంచీలో మొదటగా కూర్చున్న లావణ్యమీద కిటికీలోంచి సగం వరకు పడిన ఎండ పక్షపాతం చూపిస్తూ వెలుతుర్ని పువ్వుల్లా ఆ పిల్ల మీద జల్లుతోంది. రెండో బెంచీ చివరలో కూర్చున్న మంగిమీద మరిగించిన ఎండా, కరిగించిన వేడీ కలిపి జల్లులా కొట్టేస్తోంది.

సోషలు మేస్టారు పాఠం మొదలెట్టబోతున్నారు.

"మాస్టారూ - ప్రశ్నలడుగుతానన్నారూ, గుర్తు చెయ్య మన్నారు కూడాను" అంది లావణ్య లేచి నిలబడి వినయంగా.

"అవును కదూ - వెరీగుడ్ - ఏదీ నువ్వే ముందు అప్ప చెప్పు -" అంటూ లావణ్యకేసి తిరిగేరు.

విజ్ఞానాన్ని నింపుకున్న పెద్ద పెద్ద కళ్ళూ, కష్టాల ఎండ కన్నెరగక చిదిమితే పాలుగారే బుగ్గలూ, అప్పజెప్పే పెదాలు కదిలే తీరులో అమాయకత్వమూ, బిగువుగా చేతులు కట్టుకోవ డంలో వినయమూ ...

సోషలు మేస్టారు లావణ్యకేసి, ఆప్యాయంగా చూస్తూ ఆసక్తిగా వింటున్నారు.

సోషలు మేస్టారి కళ్ళముందు మొన్నటి డియ్యీవో విజిటు.

మున్సిపల్ టీచర్లకూ, రెసిడెన్సియల్ టీచర్లకూ నక్కకీ నాగలోకానికీ మధ్య వున్నంత తేడా వుందంటారు. పదవ

తరగతి పరీక్షలో వాళ్ళకొచ్చిన పర్సంటేజిని గొప్పగా ఉటంకించేరు డియ్యీవో.

ఎందుకుండదూ ? మంచి మెరిటు వుంటేనే గాని సీటు దొరకదక్కడ. మరి మున్సిపల్ స్కూలో....పుష్పకవిమానం!

తన క్లాసుకొచ్చి డియ్యీవోగారు.....

"ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరురా?" అని అడిగేరు. తోమ్మిదో తరగతి సిలబసులోనే లేదా విషయం. అయితే జనరల్ నాలెడ్జి అంశంగా చెప్పొచ్చును కదా అని తన మీద విరుచుకుపడ్డారు.

జనాభా లెక్కలూ, పశువుల గణాంక సేకరణా, ట్రాఫిక్ గణాంక సేకరణా, వెనుకబడినవారి గణాంక సేకరణా, ఇళ్ళ నెంబర్లు వెయ్యడం, రేషనుకార్డుల తయారి....పంపిణీ, మున్సిపల్ ఓటర్లకు ఫోటో ఐడెంటిటీ కార్డుల తయారి... పంపిణీ, అన్ని రకాల ఎన్నికలూ - పీటితో సంవత్సరంలో సగభాగం పోతుంది. పాఠాలు చెప్పడానికే లేదు లోకజ్ఞానం బోధించడానికెక్కడ ?

లావణ్య లేచి నిలబడింది.

శ్రీ ఆరెస్ పాఠిక్....అంది స్పష్టంగా.

సరి అయిన జవాబుకోసారి 'గుడ్' అంటూను, చెప్పే తీరుకు మరోసారి 'గుడ్ గుడ్' అంటూను మెచ్చుకున్నారు ఆ మ్మాయిని.

'అయినా మీలాంటి అనుభవజ్ఞుల క్లాసులో నేను ప్రశ్నలు వెయ్యడమేమిటి?, అంటూ ఓ ప్రశ్ననే పూలహారంగా మేస్టారి మెడలో వేసేరు డియ్యీవోగారు.

అడిగిన ప్రశ్నకు జవాబిస్తే మేస్టారు పాఠాలు చెప్పినట్టు, లేకపోతె మేసారు కాళ్ళు చాపుకుని విధులను నిర్లక్ష్యం చేస్తున్నట్టు....నవ్వుకున్నారు సోషలు మేస్టారు.

లావణ్యకేసి మరోసారి ఆప్యాయంగా చూసేరు.

"అప్పజెప్పేసేను మేస్టారూ....''అంది.

వరసగా ఆ బెంచీలోని వాళ్ళంతా అయ్యేరు.

రెండో బెంచీ. గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయ్ మంగికి.

''ఊ ...అప్పజెప్పు-'' కఠినంగా అన్నారు మేస్టారు.

మంగి ముంగిలా నిలబడింది.

"ఏం వచ్చునా .... రాదా ?"

తల అడ్డంగా వూపింది.

"అసలు నిన్నను చదవమన్నాను, చదివేవా లేదా?"

తల అడ్డంగా వూపింది.

"తాటి పట్టలా తలూపడమేగాని....చెప్పింది చదవాలన్న ఇంగితం లేదు.....ఏదీ....ఎందుకు చదవలేదూ....?"

"మరండి....మా అమ్మకి బాగో నేదండి.."

'అయితే నువ్వు దగ్గరుండి మందిచ్చేవా..'' పిల్లలంతా కసుక్కున నవ్వారు. మరింకేం మేస్టారు పుల్లైపోయేరు.

''మా యప్ప మాయమ్మ నాస్పట్లకి తీసికెళ్ళిందండి... ఇంటికాడెవళూ లేరనీ..''

''దొంగోడు రాకుండా దుడ్డు కర్రతో కాపలా కాసేవా... వంటా వార్పూ చేసేవా..చదవమంటే చాలు కథలు చెప్పేస్తావు. ఎంత బుద్ధి చెప్పినా వంటబట్టించుకోరు. అందెందుకు తొమ్మిదో క్లాసు కొచ్చేవు. మాట తీరే మార్చుకోవు. సదవలేదండి అనడమే గాని చదవలేదండి అని చెప్పడానికూడా ప్రయత్నించవేం...'' అన్నారు. మేస్టారు తీక్షణంగా.

"చదివేనండి.. కావాలంటే లావణ్య నడగండి. క్లాసులో చదివేను.." అని అంది మంగి నిజాయితీగా.

"ఏమ్మా లావణ్యా ?" అనడిగేరు.

వినయంగా లేచి నిల్చుని, బుద్ధిగా చేతులు కట్టుకుని, ముద్దుగా అంది లావణ్య.. ''మరండి మాస్టారూ..చదివిందండి... కాని మధ్యలో వాళ్ళమ్మ గురించీ, వేసుకున్న బట్టల గురించీ, కబుర్లు కూడా చెప్పుకున్నారండి..''

''అంతే కబుర్ల మీదున్న దృష్టి చదువు మీదుంటే ఎప్పుడో బాగు పడును..'' అంటూ రెచ్చిపోతున్నారు సోషలు మేస్టారు.

అప్పుడొచ్చింది.

అప్ప...సత్తెవప్ప!

అప్పు....సత్తెవప్పు.... రొప్పుకుంటూ....రోజుకుంటూ.... మంగిని తీసుకు వెళ్ళడానికి....

"మేస్టారండీ....మంగినొకసుట్టు పంపించండి" అంటూ ఆయాసం తీర్చుకుంది. ఆ సందట్లో మేస్టారప్పుడే సత్తెవప్ప మీద ఎగిరిపోను.

"మా యమ్మ సచ్చిపోయిందండి...." అంది మళ్లీ. అంతే. సత్తెవప్పకి మరి నోరూ రాలేదు, కడుపులోని శోకం ఆగనూ లేదు.

మేస్టారు గుండె చెరువైపోయింది. ఒళ్ళు నీరైపోయింది. ఎంత తప్పు.. ఎంత తప్పు. ఎంతెంత తిట్లు తిట్టేడు....

కసాయికూడా బలిసిన పశువుల మీదనేకాని బక్క పశువుల మీద కత్తి ఎత్తడే....

అయ్యో....అయ్యయ్యో....మంగికేసి అర్ధ్రంగా చూసేరు. "వెళ్ళు...." అన్నట్టు చూసేరు.

మంగి వెళ్తోంది. వెళ్తున్న మంగికేసి సీటిపొరలోనుండి చూసేరు మేస్టారు.

నల్లగా బక్కగా.... చీకిరి జుత్తులో.... జిడ్డోడుతూ.... జాకెట్టు మాసిపోయి....లంగా మాసికల్తో....తల్లి లేని నల్ల మేక

పిల్లలా....అనాథగా....దారీ తెన్నూ కానరాక జాలిగా వెక్కిళ్ళు పెడుతూ...

మరి చూడలేక క్లాసులోకి చూపు మరల్చేరు మేస్టారు.

ఎదురుగా లావణ్య...

గొంతులో మేతను కుక్కుకుంటూ తినలేక, తింటూ, చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోకుండా సగం మూసిన కళ్ళతో నిర్లిప్తంగా చూస్తూనే అందర్నీ తన వైపు ఆకర్షించుకొనే పందెం పొట్టేలులా కన్పిస్తున్నదిప్పుడు లావణ్య. *